హైదరాబాద్ వార్త



# గ్రూప్-2 ఎగ్జామ్ రాస్తున్నారా..

## -ఇవి లేకపోతే పరీక్ష రాసేందుకు 'నో ఎంట్రీ'






**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** గ్రూప్ 2 పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులకు టీజీపీఎస్సీ పలు సూచనలు చేస్తోంది. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్2 పరీక్షలు జరగనున్నాయి. వ్యక్తిగతంగా సైతం మెసేజ్ ల రూపంలో సూచనలను పంపుతోంది. పరీక్షకు హాజరయ్యే వారు తప్పని సరిగా హాల్ టికెట్‌పై పాస్‌పోర్ట్ సైజ్ లేటెస్ట్ ఫోటోలను అతికించాలని పేర్కొంది. హాల్‌కెట్‌పై ఫోటోలేని వారిని పరీక్ష రాసేందుకు అనుమతించమని పేర్కొంది. డిసెంబరు 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్1 జరగనుంది. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్2వ పేపర్ జరుగుతుంది. మరుసటి రోజు డిసెంబరు 16వ తేదీ ఇదే సమయాల్లో పేపర్ 3,4 పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**నిమిషం ఆలస్యమయినా అనుమతించరు..**

పరీక్షకు ఒకరోజు ముందే పరీక్షా కేంద్రాలకు వెళ్లి పరిశీలించుకోవాలని. దీంతో పరీక్షరాయడానికి సెంటర్లకు సమయానికి చేరుకోవచ్చని తెలిపింది. ఎగ్జామ్ ప్రారంభించడానికి గంట ముందు నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించనున్నట్టు పేర్కొంది. పరీక్ష ప్రారంభమయ్యే సమయం కంటే అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. పరీక్షా సమయానికి నిమిషం ఆలస్యమయినా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్, హాల్ టిక్కెట్, ఏదైనా గుర్తింపు కార్డులను(ఆధార్, పాన్ కార్డు) మాత్రమే అభ్యర్థి పరీక్షా కేంద్రంలోనికి తీసుకురావాలని తెలిపింది. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌లో బబ్లింగ్ తప్పులు లేకుండా రాయాలని సూచించింది. సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్‌లు, స్మార్ట్ వాచ్‌లు, హ్యాండ్ బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్స్, నోట్స్, ఛార్ట్‌లు లోపలికి అనుమతించరని తెలిపారు.

**హాల్ టికెట్లు డౌన్‌లోడ్..**

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ కోసం అభ్యర్థులు తమకు సంబంధించిన టీజీపీఎస్సీ ఐడీ నెంబరు, పుట్టిన తేదీ, క్యాప్చా కోడ్‌ను ఎంటర్ చేయాలి. అనంతరం డౌన్‌లోడ్ పీడీఎఫ్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే వెంటనే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతుంది. ఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించేందుకు జిల్లాల వారీగా హెల్ప్‌లైన్ నంబర్లను పెట్టారు. అభ్యర్థులు ఈ నంబర్లకు ఫోన్ చేసి వివరాలను అడగవచ్చు. ఇంకా అదనపు సమాచారం కావాలంటే టీజీపీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లు 23542185/23542187/0402244556 6/కు ఫోన్ చేయొచ్చు.

**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్**

**: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

గ్రూప్2 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రూప్2 పరీక్ష జరిగే అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తెలిపారు. అన్ని కేంద్రాల్లో సిసికెమెరాలు అమర్చడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 48011 మంది అభ్యర్థులు టిజిపిఎస్సీ గ్రూప్2 పరీక్ష రాస్తున్నారని వీరికోసం 101 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పిడబ్ల్యూడి అభ్యర్థులకోసం 27కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని..ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పరీక్షల విజయవంతానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.

# పెరుగుతున్న చలి తీవ్రత

## పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త**

నగరంలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుతున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.7 డిగ్రీలు తగ్గి 29.3 డిగ్రీలుగాను, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.3 డిగ్రీలు తగ్గి 17.7 డిగ్రీలు, ఉదయం రాత్రి సమయాల్లో పొగమంచు తీవ్రంగా పడుతోంది. వచ్చే వారం రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. గాలిలో తేమ 43శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మూడు రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని యెల్లో అలర్ట్ జారీ చపేరసింది. నగరంలో టెంపరేచర్ 3 నుంచి 5 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తీంతో జనాలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్డు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత పెరుగుతుండటంతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చేతులు, కాళ్ల శరీరంతో పాటు చెవులను కూడా కప్పి ఉంచుకోవాలని, లేకపోతే అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా చలి తీవ్రత పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు రావడం కూడా మొదలవుతుందని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## రామంతాపూర్‌లో మద్యం కోసం బూట్ల దొంగతనాలు

### -ఇంట్లో కుప్పలు తెప్పలుగా బూట్లు .. పోలీసులకు అప్పగింత

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :**

ఇప్పటి వరకు నగలు, డబ్బులు, బైక్‌లు ఎత్తుకెళ్లే దొంగలను ఎంతో మందిని చూశాం. అయితే రామంతాపూర్‌లో మద్యం కోసం రాత్రి వేళ వచ్చి బూట్లు దొంగతనం చేస్తున్న ఒక జంటను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. రామంతాపూర్ వాసవి నగర్‌లో నివసించే తలారి మల్లేష్ (35), అతని భార్య తలారి రేఖ(30) కూలి పని చేసి జీవనం సాగిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసలుగా మారిన వీరు ఇద్దరు రాత్రి వేళలలో ఇళ్లలోని చొరబడి బూట్లు, చెప్పులు ఎత్తుకెళ్తున్నారు. ఇదే క్రమంలో వీరిపై నిఘా ఉంచిన స్థానికులు బుధవారం వీరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. వీరి ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో కుప్పలు, తెప్పలుగా బూట్లు, చెప్పులు దర్శనం ఇచ్చాయి. వీరి వద్ద సుమారు 900 వరకు బూట్లు జతలు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. బూట్లు ఎందుకు దొంగతనం చేస్తున్నావని ప్రశ్నించగా వారి నుంచి ఎలాంటి సమాదానం లేదు. దీంతో నిందితుడు మల్లేష్‌తోపాటు, అతని భార్య రేఖను ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. కొద్ది రోజుల క్రితం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో మద్యం సేవించి హల్ చేసిన మహిళ కూడా రేఖ అని పోలీసులు నిర్ధారించారు. గతంలో బరాబర్ తాగుతా అంటూ హల్ చల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉప్పల్ పోలీసులు భార్యభర్తలపై దొంగతనం కేసు నమోదు చేశారు.

## మూసీ కూల్చివేతల భయంతో గుండెపోటుకు గురై వ్యక్తి మృతి

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :**

రామంతాపూర్ కేటీఆర్‌నగర్‌లో మూసీ పరివాహక ప్రాంతంలో నివసించే ఒక వ్యక్తి ఇళ్లు కూల్చివేస్తారనే దిగులుతో గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ కేటిఆర్‌నగర్‌లో నివసించే టి.రవీందర్ (55) స్కూల్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. అయితే కొద్ది రోజుల క్రితం ఇంటికి అధికారులు మార్కింగ్ చేసినట్లు స్థానికులు తెలిపారు. అతనికి డబుల్ బెడ్ రూమ్ ఇస్తారని చెప్పడంతో అధికారలు చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. కాగా రవీందర్ గురువారం ఉదయం గుండెపోటుకు గురైనట్లు తెలిపారు. దీంతో అతను మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బందువులు కోరుతున్నారు. కాగా మృతుడికి కుటుంబ సమస్యలు ఉన్నాయని అందుకే గుండెపోటుకు గురై ఉండవచ్చని మరికొందరు పేర్కొంటున్నారు.

## మారణాయుధాలతో బెదిరించి బంగారు నగలతో దుండగులు పరారీ

**ముషీరాబాద్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** మారణాయుధాలతో ఒక బంగారు నగల వ్యాపారిని బెదిరించి, గుర్తు తెలియని దుండగులు దాదాపు రెండున్నర కిలోల బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడలోని అరవింద్ నగర్ కాలనీలో రంజిత్‌గౌరాయ్ (55) అనే వ్యక్తి బంగారు నగలు తయారు చేసి అమ్మేవాడు. గురువారం తెల్లవారుఝామున ఇంటి తలుపులు ఎవరో కొట్టటంతో రంజిత్ తలుపులు తీశాడు. ఐదుగురు వ్యక్తులు ఇంట్లోకి దూసుకువచ్చి మారణాయుధాలతో రంజిత్ కుటుంబ సభ్యులను బెదిరించి ఇంట్లో ఉన్న బంగారు నగలు తీసుకుని పారిపోయారు. ఫిర్యాదు అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, సీసీ ఫుటేజీల ఆధారంతో దొంగతనానికి పాల్పడినది ఎవరు అనే విషయంపై దర్యాప్తు ప్రారంభించారు.

## అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### -అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న బి.జయలక్ష్మి

**ధర్నాచౌక్, డిసెంబర్ 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియూ) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ శీతాకాల సమావేశాలలో అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షం రాబోయే రోజుల్లో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలలో తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడి సిబ్బంది న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, నేడు బడ్జెట్ లేదని చెప్పటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ లేనప్పుడు ఎన్నికల మానిఫెస్టోలో అంగన్‌వాడీ సమస్యలు ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. అనంతరం అంగన్‌వాడి ప్రతినిధి బృందం సచివాలయానికి వెళ్లి మంత్రి సీతక్కతో అంగన్‌వాడి సిబ్బంది సమస్యలపై చర్చలు జరిపారు. అంగన్‌వాడి సిబ్బందికి కనీస వేతనం 18వేలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో విడుదల చేయాలని, తదితర 17 సమస్యలను మంత్రికి తెలియ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి సీతక్క అంగన్‌వాడి సిబ్బంది సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వటంతో తమ పోరాటాలను వాయిదా వేస్తున్నామని విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ ఉపాధ్యక్షులు కే.ఈశ్వర్‌రావు, యూనియన్ అధ్యక్షులు సునీత, పద్మ, నాయకులు రత్నం, రాజేందర్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# సాలర్‌జంగ్ మ్యూజియం 73వ వ్యవస్థాపక దినోత్సవం

**-సాలార్‌జంగ్ మ్యూజియం స్మార్ట్ ఈ టిక్కెట్ సిస్టమ్‌ను ప్రారంభించనున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**-మ్యూజియంలో నలభై గ్యాలరీలు**

**- అద్భుతమైన కళాఖండాలు,లైబ్రరీలో యాభై వేల పుస్తకాలు**



సాలార్‌జంగ్‌లోని డబుల్ స్టైచ్ విగ్రహం



పాలరాతి ముసుగు సుందరి (రెబెక్కా)



గంటల కొట్టె గడియారం



సాలార్‌జంగ్ మ్యూజియం చిత్రం



1951లో దివాన్‌దేవిడిలో సాలార్‌జంగ్ మ్యూజియం

**చార్మినార్ డిసెంబరు 12 ప్రభాతవార్త :** కళాఖండాలకు నిలయమైన సాలర్‌జంగ్ మ్యూజియం ప్రపంచంలోనే ఎంతగానో ప్రసిద్ది గాంచింది. మ్యూజియంలోనిఅద్భుతమైన కళాఖండాలను తిలకించి సందర్శకులు ఎంతో అనుభూతికి లోనవుతుంటారు .ప్రతీ రోజు సాలార్‌జంగ్ మ్యూజియం పర్యాటకులతో కళకళ లాడుతుంటుంది .సాలార్‌జంగ్ మ్యూజియంలోని నలభై గ్యాలరీలలో దాదాపు నలభై ఎనిమిది వేల కళ ఖండాలు ఉన్నాయి. మ్యూజియంను తిలకించటానికి వచ్చే సందర్శకులు ఎంతో ఆసక్తితో మ్యూజియంలోని కళా వస్తువులను చూస్తుంటారు. మొదటి సాలార్‌జంగ్, రెండవ సాలార్‌జంగ్, రెండవ సాలార్‌జంగ్‌లు దేశ, విదేశాలునుంచి ఎంతో అద్భుతమైన కళాఖండాలను సేకరించారు. కాగా మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ సేకరించిన కళాఖండాలు ఎక్కువగా ఉన్నాయి. సాలార్‌జంగ్‌ల కుటుంబ సభ్యులు మదీనా చౌరస్తాకు అతి దగ్గరలో ఉన్న దివాన్‌దేవిడిలో సాలార్‌జంగ్ మ్యూజియంను స్థాపించారు. అప్పటి భారత దేశ ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చేతుల మీదుగా సాలార్‌జంగ్ మ్యూజియం 1951వ సంవత్సరం డిసెంబరు నెల16వ తేదీన మ్యూజియం ప్రారంభించబడింది. 17 సంవత్సరాలు పాటు సాలార్‌జంగ్ మ్యూజియం దివాన్‌దేవిడిలో ఉంది. కాగా మూసీనది ఒడ్డున నయాపూల్ వద్ద నిర్మించిన సాలార్‌జంగ్ మ్యూజియం కొత్త భవనాన్ని 1968, జూలై నెల 24వ తేదీన అప్పటి రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. 1951 నుంచి నేటి వరకు సాలార్‌జంగ్ మ్యూజియం అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రపంచంలోనే ఎంతగానో ప్రసిద్ది గాంచింది. సాలార్‌జంగ్ మ్యూజియంలో తరుచుగా పలు అంశాలపై ప్రత్యేక ఫోటో ప్రదర్శనలు, సెమినార్లు జరుగుతుంటాయి. సాలార్‌జంగ్ మ్యూజియంలో అత్భుతమైన నలభై గ్యాలరీలు హైదరాబాద్ పాతబస్తీ మూసీనది ఒడ్డున నయాపూల్‌లో ఉన్న సాలార్ జంగ్ మ్యూజియంలో నలభై గ్యాలరీలు ఉన్నాయి. ఇండియన్ బ్రౌచ్ గ్యాలరీ, ఇండియన్ స్టోన్ కల్చర్ గ్యాలరీ, ఇండియన్ మోడరన్ పెయింటింగ్ గ్యాలరీ, ఇండియన్ మినీ పెయింటింగ్ గ్యాలరీ, టెక్స్‌టైల్ గ్యాలరీ, వాకింగ్ స్టిక్ గ్యాలరీ, ఆర్ట్ గ్యాలరీ, జపానీస్ గ్యాలరీ, చైనీస్ గ్యాలరీ, యూరోపియన్ పెయింటింగ్ గ్యాలరీ, ఫ్రెంచ్ గ్యాలరీ, యూరోపియన్ ల్యాంప్ గ్యాలరీతో పాటు నలభై గ్యాలరీలు ఉన్నాయి. మొదటి సాలార్‌జంగ్ నవాబ్ మీర్ తురభ్ అలీ ఖాన్ 1876లో ఇటలీ నుంచి సేకరించిన పాలరాయి రెబెక్కా విగ్రహం, మూడవ సాలార్‌జంగ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఇంగ్లాండు నుంచి సేకరించిన అరుదైన గడియారం, అదే విధంగా ఫ్రాన్స్ నుంచి సేకరించిన డబుల్ స్టెచ్యూ విగ్రహాలను తిలకించి పర్యాటకులు ఎంతో అనుభూతికి లోనవుతుంటారు. ప్రతీ శుక్రవారం సాలార్‌జంగ్ మ్యూజియంకు సెలవు. మిగతా రోజులలో సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉదయం పది గంటలు నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు తెరచి ఉంటుందని మ్యూజియం కీపర్ డాక్టర్. ఘనశ్యామ్ కుసుం తెలిపారు. పెద్దలకు 50 రూపాయలు, చిన్న పిల్లలకు చిన్న పిల్లలకు 20 రూపాయలు, కెమెరాకు 50 రూపాయలు, సెల్‌ఫోన్‌కు 50 రూపాయలుగా ప్రవేశ టిక్కెట్ రుసుంను వసూలు చేస్తున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలోని లైబ్రరీలో ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగుతో పాటు పలు భాషలకు చెందిన దాదాపు యాభై వేల పుస్తకాలు ఉన్నాయి. కాగా రాష్ట్ర గవర్నర్, సాలార్‌జంగ్ మ్యూజియం బోర్డు చైర్మన్ జిష్ణు దేవ్ వర్మ ఈ నెల 16వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలో కొత్తగా ఏర్పాటు చేసిన కియోస్కో స్మార్ట్ టిక్కెట్ సిస్టమ్‌తో పాటు శూన్యత అన్న అంశపై మ్యూజియంలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారని మ్యూజియం కీపర్ డాక్టర్. ఘనశ్యామ్‌కుసుం వెల్లడించారు. సాలార్‌జంగ్ మ్యూజియ 73వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మ్యూజియంలో పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

# డిజిటల్ పేమెంట్‌తో బస్‌టికెట్ తీసుకునే అవకాశం

**-త్వరలో ప్రారంభించేందుకు టిజిఎస్ఆర్టీసి సన్నదం**

**-ఇప్పటికే రెండు డిపోల్లో ప్రయోగం విజయవంతం**

**-గ్రేటర్ వ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలుకు చర్యలు**




**హైదరాబాద్, డిసెంబరు 12,ప్రభాతవార్త:**

బస్సుల్లో కండక్టర్, ప్రయాణికులకు మధ్య ఎక్కడ చూసిన చిల్లర గొడవలు నిత్యకృత్యమయ్యాయి. ఈ సమస్యను తీర్చేందుకు పూర్తిస్థాయి డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు తెలంగాణ ఆర్టీసీ టిజిఎస్‌ఆర్టిసి సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్ డిపోల్లోని 140 బస్సుల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన డిజిటల్ చెల్లింపుల ప్రక్రియకు విశేష స్పందన వచ్చింది. దీంతో గ్రేటర్‌లోని అన్ని డిపోల్లో అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. అవసరమైన 4,500 ఇంటలిజెంట్ టికెటింగ్ యంత్రాలను సమకూర్చుకుంటోంది. ఇవన్నీ ఇంటర్నెట్ ఆధారంగా పనిచేయనున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా 10,000 ఐటిమ్స్ యంత్రాలు అవసరమవుతుండగా సగం మేర గ్రేటర్‌లోనే వినియోగించనున్నారు. దీంతో క్యూఆర్ కోడ్ స్కానింగ్, కార్డు స్వైపింగ్‌తో ప్రయాణికులు టికెట్ కొనే వెసులుబాటు కలుగనుంది. కాగా ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ లో మెజార్టీ ప్రయాణికులు డిజిటల్ చెల్లింపులకు అలవాటుపడ్డారు. ప్రయాణికులంతా బస్సుల్లో టికెట్ కొనుగోలుకు రూ.100, రూ.200 నోట్లు ఇస్తుండటంతో కండక్టర్లకు ఇబ్బంది కర పరిస్థితి ఎదురవుతోంది. అలాగే రూ.10 నాణేలను తీసుకోవడంలోనూ కండక్టర్లు, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరుగుతోంది. ఈ నాణేన్ని తీసుకోవాలని ఆర్బీఐ కోరుతున్నా, స్వయంగా తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించినా కొన్ని బస్సుల్లో తీసుకోవడం లేదంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు ప్రారంభమైతే చిల్లర కష్టాలు తీరిపోనున్నాయి.

**విద్యార్థుల బస్‌పాస్‌కు యాప్ :**

గ్రేటర్ పరిధిలో 5లక్షల మందికి పైగా విద్యార్థులు వేర్వేరు కళాశాలల్లో చదువుతున్నారు. వీరంతా బస్‌పాస్ రెన్యూవల్ కోసం ప్రతినెలా వరుసలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసమస్యను పరిష్కరించేందుకు టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. యాప్‌తో బస్ పాస్‌లు పొందే వెసులుబాటు కలగనుంది. తద్వారా పాస్‌ను కండక్టర్‌కు మొబైల్‌లోనే చూపించి ప్రయాణించొచ్చు.

**మహిళలకు స్మార్ట్ కార్డ్ :**

ప్రస్తుతం టీజీఎస్ ఆర్టీసీలో 9 వేలకు పైగా బస్సులు ఉన్నాయి. రోజూ సుమారు 55 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. సిటీ, పల్లె బస్సుల్లో ప్రస్తుతం కండక్టర్లు సాధారణ టిమ్‌లు ఉపయోగించి టికెట్లు జారీ చేస్తున్నారు. వీటిల్లో కేవలం నగదుతోనే టికెట్లు జారీ చేయాలి. కొత్తగా ప్రవేశపెట్టనున్న ఐటిమ్స్‌తో డెబిట్ కార్డులు, క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో యూపీఐ చెల్లింపులు జరపొచ్చు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకాన్ని ప్రవేశ పెట్టాకా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగిపోయింది. వీరి ఆధార్ కార్డులు చూసి జీరో టికెట్లు జారీ చేస్తున్నారు. ఇకపై మహిళలకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు చేయనున్నట్లు తెలిసింది. ఇక నుంచి ఆ కార్డుల్ని స్వైప్ చేసి జీరో టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడున్న టిమ్స్ వల్ల బస్సులు సాయంత్రం డిపోకు వచ్చిన తర్వాత కానీ ఏ సర్వీసు నుంచి ఎంత ఆదాయం సమకూరిందన్న విషయం తెలీదు. కానీ ఐటిమ్స్ వల్ల బస్సు కదలికలు, సిబ్బంది పని తీరు, ఆదాయం తదితర విషయాలు స్పష్టంగా తెలుస్తాయి. దీంతో అధికారులు ఆ బస్సు కండక్టర్‌తో మాట్లాడి కారణం తెలుసుకుని ప్రయాణికుల సంఖ్య పెంచేందుకు సూచనలు, సలహాలు ఇవ్వొచ్చు.

# వైకల్యం విజయానికి అవరోదం కాదు : గవర్నర్ జిష్ణుదేవ్



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

**వర్మకంటోన్మెంట్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** వైకల్యం విజయానికి అవరోదం కాదని నిరూపించారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బేగంపేటలోని అదిత్య మెహతా ఫౌండేషన్ ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమిలో అధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న హై ఫెర్మార్మెర్స్ అకాడమిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ ఎబిలిటి గేమ్స్ 2024లో పథకాలు సాధించిన పార అథ్లెట్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాలపై సంకల్పబలం సాధించిన విజయాలు అని తెలిపారు. ఈ క్రీడాకారులు అసమానతలను దిక్కరించారన్నారు. అవిశ్రాంత విక్షణ పొంది అసాధారణ మైలురాళ్లను సాధించారని అన్నారు. అకాడమిలో సౌకర్యాలు ప్రపంచస్థాయిలో ఉన్నాయని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో మొదటిసారి పారా స్పోర్ట్స్ అకాడమిని ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఇది ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తమ ప్రతిభను ప్రదర్శించడానికి గొప్ప అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయ దక్షిణ విభాగ ఉప కమిసనర్, ప్రాంతీయ అధిపతి టి. గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు త్వరగా ఇళ్లు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు ఏడాదిగా ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులుగా వున్నారని కావున వెంటనే ప్రభుత్వం వారికి పునరావాసం క్రింద డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించి ఆదుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ, బి సి సంక్షేమ మరియు హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ.వినయ్ కుమార్ కోరారు. గురువారం మంత్రిని కలిసి ఇదే విషయంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బస్తి వాసుల ఇళ్ళ కేటాయింపు పై వ్రాసిన లేఖను అందజేశారు. ఇప్పటికే బస్తి వాసులు ఇళ్లు లేక, ఆర్థికంగా చాలా నష్ట పోయారని వెంటనే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించి న్యాయం చేయాలని వినయ్ కుమార్ గారు కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారని, త్వరలో బాధితులకు ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావు, వసంత్ పాల్గొన్నారు.

## దగాపడ్డ కళాకారుల డప్పుల మోత



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాటల పల్లకిలో 32 గంటలు దగపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమం గురువారం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 550 ఉద్యోగాలు కళాకారులకు ఇచ్చిందని, నిజమైన కళాకారులకు నిజమైన ఉద్యమకారులకి అవకాశం రాక అన్యాయం జరిగిందని కళాకారులు తమ పాట ద్వారా గళాన్ని వినిపించారు. ఇదే విషయంలో అనేక ఉద్యమాలు జరిగాయని, అయినా ప్రభుత్వం అందరిని అణచి వేసస్తూ అరెస్టులు చేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ మేనిఫెస్టో లో అధికారం లోకి రాగానే ఉద్యగాలను ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. నిజమైన ఉద్యమ కళాకారులకు న్యాయం చేసి వెయ్యి మందికి ఉద్యోగాలు ఇవ్వాలని నేర్నాల కిషోర్ అన్నారు. కార్యక్రమంలో అతిథులుగా తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వసుజాత, ప్రముఖ గాయకుడు అందెశ్రీ, రఘు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాకారులు తమ పాట ద్వారా తమ బాధను ఆటపాటలతో వ్యక్తం చేశారు.

## పేదలకు సిఎంఆర్ఎఫ్ వరంలాంటిది : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోపాల్‌కృష్ణ కుమారుడి చికిత్స కోసం సిఎం రిలీఫ్‌ఫండ్ ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త** పేదల వైద్య చికిత్సకు సిఎంఆర్ఎఫ్ ఎంతో దోహదపడుతున్నదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కె.గోపాల్‌కృష్ణ తన కుమారుడు కె.వంశీకి నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స కోసం 2లక్షల సిఎంరిలీఫ్ ఫండ్ ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్న ప్రమాదకర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు ఆర్థికంగా దెబ్బతింటున్నారని, అలాంటి వారికి సిఎంఆర్ఎఫ్ ఒక వరం లాంటిదని పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ముషీరాబాద్ నియోజకవర్గం లోని రాంనగర్ డివిజన్ చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ లైన్ లో సీవరేజ్ వాటర్ పైప్‌లైన్, ఆర్టీసీ క్రాస్ రోడ్ లో వాటర్ పైప్ లైన్ పనులను స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠా గోపాల్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. టిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శంకర్ ముదిరాజ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, నాగభూషణం, కందూరి కృష్ణ, మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, జయదేవ్, జనార్ధన్, కొండమడుగు మధు, శివ యాదవ్, షాప్ జనార్ధన్, కూరగాయల శ్రీనివాస్, సునీల్, వెంకటేష్, మహేష్, శ్రీకాంత్ ముదిరాజ్, జి శ్రీనివాస్, గోక నవీన్, జ్ఞానేశ్వర్, నితిన్, శ్రీధర్ జలమండలి అధికారి మేనేజర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్ రోడ్డుపై యాక్సిడెంట్

**అత్తాపూర్ డిసెంబరు12, ప్రభాతవార్త :** ఔటర్ రింగ్ రోడ్డుపై కారు బీభత్సం సృష్టించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.... ఔటర్ రింగ్ రోడ్డు నుండి రాజేంద్రనగర్ వచ్చే దారిలో బ్రేక్ డౌన్ అయిన ఎర్టిగా కారు సైడ్‌కు నిలిపి ఉంచారు. అతివేగంగా దూసుకొచ్చిన ల్యాండ్ రోవర్ కారు ఒకసారిగా ఎర్టిగా కారును ఎవనుక వైపు నుండి ఢీకొట్టింది. దింతో వాహనం ధ్వంస అయింది. ఎవ్వరికి ఎలాంటి ప్రమాద జరగలేదని తెలిపారు. అయితే యాక్సిడెంట్‌కు కారణమైన ల్యాండ్ రోవర్ కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# శ్రామిక బహుజన, విప్లవోద్యమనేత చంద్రన్న



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, చిత్రంలో ప్రఫుల్‌రాంరెడ్డి

**చిక్కడపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త:** కళ్ళెపు చంద్రన్న ఈ దేశపు శ్రామిక భహుజన, విప్లవోద్యమనేత అని పలువురు వక్తలు కీర్తించారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చంద్రన్న ఐదవ వర్ధంతి సభ కె.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో గోదావరిలోయ ప్రతిఘటన పోరాట నిర్మాత కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి మార్క్సిస్టు, లెనినిస్టు రాజకీయాల వైపు ఆకర్షితుడై, అదే పార్టీకి విప్లవ కార్మికవర్గ నాయకుడిగా చంద్రన్న ఎదిగారని అన్నారు. ఐ.ఎఫ్.టి.యు. నేతగా అనేక విప్లవ కార్మిక సంఘాలతో కలిసి ఏ.ఐ.ఎఫ్.టీ.యు.గా ఒకే ట్రేడ్ యూనియన్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించారని గుర్తుచేశారు. 2005లో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడి హాయాంలో నక్సలైట్లతో శాంతి చర్చలకు ప్రధాన భూమికగా వ్యవహారించారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో అనేక సంఘాల ఏర్పాటులో ముందు నిలిచాడని, పది సంవత్సరాలు ఏ రాజకీయ నిర్మాణంలో లేకపోయినప్పటికీ, విప్లవ బావాలకు దూరంగా లేరని వెల్లడించారు. దళిత భహుజన కార్మికవర్గ లాల్ నీల్ ఐక్యతకు ఎంతగానో కృషి చేశారన్నారు. సభ ప్రారంభానికి ముందు చంద్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, తిరుపతి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రఫుల్ రాంరెడ్డి, స్కైలాబ్, ఒపిడిఆర్ లక్ష్మీదేవి, సీనియర్ న్యాయవాది హేమలలిత, ఐ.ఎఫ్.టి.యు. (శ్రామిక స్పందన) షేక్ షావలి, బి.ఎల్.ఎఫ్. ధనలక్ష్మి, ఎల్ హెచ్. పీ.ఎస్. పాండు తదితరులు పాల్గొన్నారు. ప్రజా ఉద్యమ కళాకారుల వేధిక ఏ.యాదగిరి, డోలక్ యాదగిరి, గంగి గంగిరాజ్, లెల్లే(బుజ్జి) సురేష్ కళాకారులు ఆలపించిన భహుజన, విప్లవ ఆట పాటలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సందర్భానికి తగ్గట్టుగా సౌమ్యుడిగా, మృదు స్వభావిగా, పోరాట నేతగా ఎదిగిన చంద్రన్నపై పాటలు కట్టి, ఆలపించిన గేయాలు ఎంతగానో ఆలోచింప జేశాయి.

# శంకరమఠంలో ముగిసిన హరికథా మహోత్సవాలు



శంకరమఠంలో బుర్రా పద్మనాభశర్మ భాగవతులు 'శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం' హరికథా కథాగానం చేస్తున్న దృశ్యం

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త** నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాస 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి సందర్భంగా నిర్వహించిన హరికథా మహోత్సవములు శోభాయమానంగా ముగిశాయి. అన్నమయ్య పరివారం వ్యవస్థాపకులు యనమండ్ర వెంకట కృష్ణయ్య, నేతి కుటుంబము నుండి విశ్వేశ్వరరావు దంపతులు, రామకృష్ణ, పద్మశ్రీ దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణి, రాష్ట్ర హరిదాస సంఘం అధ్యక్షుడు బి. లక్ష్మీనారాయణ భాగవతులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు తెలుగు సంస్కృతి చరిత్రలోనే కాదు భారత సంస్కృతి చరిత్రలోనే అపూర్వ వైశిష్టం కలవారని, ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉన్నవారు ఎందరో ఉండవచ్చు కానీ ఆట పాట మాటలో మేటి అనిపించుకున్నవారు అరుదుగా ఉంటారన్నారు. దాసుకు పూర్వం హరికథా చాయలు ఉన్నా దానికి ఒక సమగ్రమైన స్వరూపము, ఉన్నతమైన పీఠం, విశాలమైన పరిధి సంతరించి పెట్టినవారు నారాయణదాసని, ఆయన పాండిత్యం అనేకమైన భాషలకు, శాస్త్రాలకు సంబంధించినదని, ప్రావీణ్యం బహు కళలకు విస్తృతమైనదని, వ్యక్తిత్వం విశిష్టమైనదని, జీవితం స్వతంత్రమైనదని తెలియచేశారు. దాసు సంస్కృతాంధ్రాలలో మహాకవి, హరికథకు సృష్టికర్త, అచ్చతెలుగుకు అశ్వత్థవృక్షం, మహానటుడు, గంధర్వ గాయకుడు, సకల శాస్త్ర పారంగతుడు, వీణావాదన విశారదుడు, అష్టభాషాకవి మరియు బహుభాషావేత్తయని, ఈ పరమ భక్తాగ్రేసరుడు హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు ప్రజలకు దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహోపాధ్యాయుడని కూడా కొనియాడారు. అనంతరం విజయవాడకు చెందిన బుర్రా పద్మనాభశర్మ భాగవతల మధురస్వరంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం కథాగానముచేసి శ్రోతలను ఆకట్టుకున్నారు. డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయోలిన్ పైన, కే.చిదంబర నటరాజ్ కుమార్ మృదంగంపైన మృదువైన వాద్య సహకారం అందచేశారు. కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత దాలిపర్తి ఉమామహేశ్వరి భాగతారిణికి ఉత్సవముల నిర్వాహకులు ముఖ్య అతిధి ప్లాంజేరి శంకరనారాయణ చేతుల మీదుగా హరికథా సరస్వతి బిరుదు, సన్మానపత్రము, శాలువతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిధి ప్లాంజేరి శంకరనారాయణ మాట్లాడుతూ నారాయణదాస హరికథా సంప్రదాయాన్ని, పరంపరను ఆయన ప్రియశిష్యులు నేతి లక్ష్మీనారాయణ కొనసాగించినట్లు నేటి తరం హరిదాసులు కూడా కొత్త శిష్యులను తీర్చిదిద్ది సనాతనమైన ఈ హరికథలను భావితరాల వారికి అందచేయవలసిన భాధ్యత తీసుకోవాలని తెలియచేశారు. చివరలో కళాకారులను నిర్వాహకులు శాలువలతో సత్కరించారు. ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకట కృష్ణయ్య వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిశాయి.

# ఓ.యూలో ఘనంగా ఏఈజీ స్వర్ణోత్సవ వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ ప్రొ.హర్ష్ కె.గుప్తా తధితరులు

**తార్నాక, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, ఎన్జీఆర్ఐ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ హర్ష్ కె. గుప్తా అన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్ ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ జియోఫిజిక్స్ విభాగంలో జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్ పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్ ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హర్ష్ కె గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సదస్సు నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. అప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంటాయని అభిప్రాయపడ్డారు. పరిశోధనలవైపు విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఇతర వక్తలు మాట్లాడుతూ భౌగోళిక అన్వేషణలో ఓఎన్‌జీసీ, , జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ఏఎండీ, ఇతర కేంద్రప్రభుత్వ సంస్థలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణా సాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరవణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, ఏఈజీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ బి. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లిపీర, డాక్టర్ ఎంఎన్ చార్ పాల్గొన్నారు.

# ప్రముఖ సాహితీవేత్తలు అమ్మంగి వేణుగోపాల్, వెల్దండ నిత్యానందరావులు

### రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్



పురస్కారాల గ్రహీతలతో రియాజ్, ఉదయవర్లు తదితర అతిథులు

**నాంపల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** డా. అమ్మంగి వేణుగోపాల్, డా. వెల్దండ నిత్యానందరావులు సుప్రసిద్ధ సాహితీవేత్తలని వారికి రావిచెట్టు రంగారావు తెలుగుభాషా వికాస పురస్కారం; ఎం.ఎల్.నరసింహారావు సాహితీసేవా పురస్కారం ప్రదానం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ అన్నారు. నిర్వాహకులు శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషా నిలయం అశేషసేవలను కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో గురువారం రాత్రి సంస్థ గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు నిర్వహణలో జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు డా. రియాజ్ విశిష్ట అతిథులు తిరునగరి దేవకీదేవి, సంగనభట్ల నర్సయ్య తదితరులతో కలిసి సుప్రసిద్ధ రచయిత, కవి డా. అమ్మంగి వేణుగోపాల్‌కు భాషానిలయం వ్యవస్థాపక కార్యదర్శి, వితరణశీలి రావిచెట్టు రంగారావు జయంతిని పురస్కరించుకొని రావిచెట్టు రంగారావు తెలుగుభాషా వికాస పురస్కారం-2024; ప్రసిద్ధ పరిశోధకుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డా. వెల్దండ నిత్యానందరావులను ఘనంగా సత్కరించి భాషానిలయం దీర్ఘకాల కార్యదర్శి, రచయిత ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవా పురస్కారం-2024 బహూకరించి ఎంతగానో అభినందించారు. భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు స్వాగతోపన్యాసంలో సంస్థ సుదీర్ఘ చరిత్రను, సాహిత్యానికి, యువతాభ్యుదయానికి చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఇస్తున్న అవార్డులు, కృషిని సవివరపరిచారు. చివరిగా పురస్కారగ్రహీతలు తమ స్పందనను తెలిపారు.

# క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు



ఎస్‌పిఆర్‌హిల్స్ జిహెచ్ఎంసి గ్రౌండ్‌లో నిర్వహించబోయే గ్రాండ్ క్రిస్మస్ వేడుకల పనులను పరిశీలిస్తున్న జుబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్.

**యూసుఫ్‌గూడ, డిసెంబర్ 12, ప్రభాతవార్త :** క్రైస్తవ సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. ఇందుకుగాను గురువారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పిఆర్‌హిల్స్ జిహెచ్ఎంసి గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఈనెల 14వ తేదిన గ్రాండ్ క్రిస్మమస్ వేడుకలను నిర్వహించనున్నామని నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లకు చెందిన పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు, కార్పోరేటర్‌లు రాజ్‌కుమార్ పటేల్, దేదిప్య విజయ్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మన సంస్కృతి సంప్రదాయాలు విశ్వఖ్యాతినొందాయి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



శ్రీమద్భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌యాదవ్, దూబే, మాణిక్‌రావు, చెన్నప్ప, బాలరాజ్‌యాదవ్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** విశ్వవ్యాప్తంగా ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో ఎంతో గొప్పనైన మన సంస్కృతిని, సంప్రదాయాలను ఆచరిస్తున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్న తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేటితరం యువతలో అనేకమందికి మన పండుగల విశిష్టతలు, ఆచారాలు తెలువకపోవడం బాధాకరమని అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తలసాని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు డ్యాగ బాలరాజ్ యాదవ్ 700 శ్లోకాలతో కూడిన భగవద్గీతకు అదనంగా మరో 45 శ్లోకాలనుచేరి 745 శ్లోకాలతో కూడిన కర్మ, భక్తి, జ్ఞాన విభాగాలతో రూపొందించిన శ్రీ మద్భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఇలాంటి పుస్తకాల ద్వారా మన చరిత్రను తెలుసుకోవచ్చున్నారు. అలనాటి అనేకరకాల చరిత్రను పుస్తకాల రూపంలో ప్రజల ముందుకు తీసుకొస్తున్న కవులు రచయితలకు అభినందనలు తెలిపారు. ప్రతీఒక్కరూ తప్పనిసరిగా మన చరిత్ర, సంప్రదాయాలను తెలిపే పుస్తకాలను తప్పక చదవాలని, మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. చివరిగా బాలరాజ్ యాదవ్‌ను తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చెన్నప్ప, ఆచార్య కసిరెడ్డి, జగన్నాథశాస్త్రి, ధర్మదాత, లావణ్య, పూర్ణ, కృష్ణస్వామి, దూబే, మాణిక్‌రావు పాటిల్, పార్థసారథి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగమణి నాట్యసేవలు అనితరసాధ్యం : సాహితీవేత్త ఓలేటి పార్వతీశం



గురువు రంగమణికి నృత్యనీరాజనం సమర్పిస్తున్న శిష్యులు

**రవీంద్రభారతి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ప్రసిద్ధ నాట్యగురువు సి.ఆర్. ఆచార్యులు వారసురాలిగా కూచిపూడి, ఆలయ సంప్రదాయ నృత్యాలకే అంకితమై ఎంతోమంది శిష్య ప్రశిష్యులను అత్యుత్తమ నృత్యకళాకారులుగా తీర్చిదిద్దిన ఓలేటి రంగమణి నాట్యసేవలు అనితరసాధ్యమని వక్తలు కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఓలేటి రంగమణి 5దశాబ్దాల నాట్యసేవల వైభవాన్ని శిష్యులంతా కలిసి మహా నాట్యారాధన మహోత్సవాన్ని నృత్యప్రదర్శనలతో కన్నుల పండువగా జరిపి గురుసత్కారం కావించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ముందుగా వినాయకస్తుతితో కూచిపూడి నృత్యాంశాన్ని ప్రారంభించి సంధ్యాతాండవం, మండోదర శపథం తదితర అంశాలను అర్థవంతంగా ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. ముఖ్యంగా శ్రీనికరెడ్డి ప్రదర్శించిన అలమేలుమంగ ప్రవేశదరువు ఎంతో ఆకట్టుకుంది. ప్రవల్లిక పార్వతీ ప్రవేశ దరువు, మధుమిత జక్కులకాంత దరువులతో అలరించారు. వైష్ణవి వర్ణంతో కట్టిపడేసారు. చివరిగా సింహనందిని నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఓలేటి పార్వతీశం నాట్య అర్ధశతాబ్ది నిర్వహించుకునే అదృష్టభాగ్యం కొందరికే దక్కుతుందని, అందులో నాటి నేటి మేటిగురువు రంగమణి అని కొనియాడారు. విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, శివనాగేశ్వరరావు, డా. అనంతలక్ష్మి, డా. ఆర్.ప్రసన్నరాణి, నిర్మల ప్రభాకర్ తదితరులు పాల్గొని రంగమణి సేవలను ప్రశంసించి వారి శిష్యబృందాన్ని అభినందించారు.

# లింక్ రోడ్డు ను పరిశీలించిన దాన కిషోర్..



లింక్‌రోడ్ మ్యాప్ పరిశీలిస్తున్న దానకిశోర్, కమిషనర్ ఇలంబర్తి, తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 12, ప్రభాతవార్త:** హెచ్‌సిటీ ప్రాజెక్టు పనుల అమలుపై ఎఐయుఎంలో సమావేశం నిర్వహించిన అనంతరం గురువారం రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జి హెచ్ ఎం సి కమిషనర్ ఇలంబర్తి ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాయంత్రం మాసబ్‌ట్యాంక్ విరించి జంక్షన్, ..పెన్షన్ ఆఫీస్ వద్ద రోడ్డు ను.. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసేందుకు విరించి వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధితో పాటు సుందరీకరణ పనుల చేపట్టాలని ఆదేశించారు అందుకు నిధులు కూడా మంజూరు చేసినట్లు ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ అధికారులను ఆదేశించారు, ఎలక్ట్రికల్ పోల్‌ల షిఫ్టింగ్ అధికారులకు సూచనలు చేశారు. పెన్షన్ ఆఫీస్ వద్ద బల్కాపూర్ నాలాపై సిమెంట్ బ్రిడ్జి నిర్మించి రోడ్డు 12ను అనుసంధానం చేస్తారు. పెన్షన్ ఆఫీస్ జంక్షన్ ట్రాఫిక్ భారం పడకుండా నేరుగా లింక్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. జంక్షన్ అభివృద్ధి తో సుందరీకరణతో పాటి లింక్ రెడ్డి నిర్మాణ పనులకు చేపట్టేందుకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యకార్యదర్శి అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి జోనల్ యస్ ఈ రత్నాకర్ ఈ ఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లవి మోడల్ హైస్కూల్ భవనంపై నుండి పడిన విద్యార్థి



పల్లవి మోడల్ హైస్కూల్‌లో రెండవ అంతస్థు నుండి పడి గాయాలకు గురైన విద్యార్థి

**హైదరాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త** బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లవి మోడల్ హైస్కూల్‌లో రెండవ అంతస్తు నుండి తనీష్ రెడ్డి అనే విద్యార్థి అకస్మాత్తుగా కిందపడ్డాడు. పై అంతస్తు నుండి విద్యార్థి ఒక్కసారిగా కిందపడడంతో పాఠశాలలో విద్యార్థులంతా భయాందోళన గురయ్యారు. పల్లవి మోడల్ పాఠశాలలో తనీష్ రెడ్డి 9వ తరగతి చదువుతున్నాడు. హుటా హుటిన ఆస్పత్రికి తరలించిన పాఠశాల యాజమాన్యం తనిష్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థి ప్రమాదవశాత్తు కింద పడ్డాడా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తనకు ఏం జరిగిందో తెలియదని వెంటనే సీసీ కెమెరాలు చూడాలని విద్యార్థి తన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యాన్ని కోరుతున్నాడు.

## వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ



శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 12 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రేమావతిపేటలో గురువారం అత్యంత వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం జరిగింది. రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజలో పాల్గొన్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## చలి పెరగటంతో వణికి పోతున్న ప్రజలు

**చార్మినార్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** రాత్రి వేళల్లో చలి ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయటకు రావటానికి సందేహిస్తున్నారు. అత్యవసర పనులు నిమి త్తం మాత్రమే ప్రజలు బయటకు వస్తున్నారు. పాతబస్తీలోని రహదారులు రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. చలి పెరుగు తుండటంతో ప్రజలు రాత్రి వేళల్లో చలికి గజ గజ వణికి పోతున్నారు. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం మప్లెర్లు, క్యాప్‌లు, స్వెట్టర్లు కొనుగోలు చేస్తున్నారు. చాంద్రాయణగుట్ట, బార్కస్, మహ్మద్ క్యాప్ మార్ట్, సంతోష్ నగర్, పటేల్ మార్కెట్, మీర్‌చౌక్, కిల్వత్, మూసాబౌలి ప్రాంతాలలోని షాపులలో పలు రకాల మప్లెర్లు, మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు అమ్మకాలు జరుగుతున్నాయి. కాగా పాతబస్తీలోని పలు బస్తీలలో వేకువ జామున చలి నుంచి కాపడుకోవటానికి కట్టెలతో మంటలు ఏర్పాటు చేస్తున్నారు.

## రాఘవేంద్రనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



సమస్యను తెలుసుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలటోని రాఘవేంద్రనగర్‌లో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ లకు వెళ్లే దారులన్నీ దాదాపు అన్ని భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించి విశాలమైన సిమెంటు రోడ్లు చేయడమైందన్నారు. కేవలం ఆర్ఎస్ తిరుమల టవర్ నుండి శాంతి గార్డెన్స్ వరకు ఇదివరకు మంజూరైన కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో పెండింగ్లో పడ్డాయన్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు పలుమార్లు తమకు ఈ సమస్య పరిష్కరించాలని కోరడం జరిగిందని దీంతో తాము పర్యటించడం జరిగిందన్నారు. ముందుగా డ్రైనేజీ, సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్లు తయారు చేయవలసిందిగా అధికారులకు సూచించడం జరిగిందన్నారు. తొందర్లోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్ నాయకులు మేకల ముత్యం రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, విఠల్ యాదవ్, దాసరి కర్ణ, కిట్టు, సత్యం, రహీం, ఆదిల్, మురళి, వెంకటేష్ వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటి నుంచి వెళ్ళిన మహిళ అదృశ్యం..

**కొంపల్లి, డిసెంబర్ 12, ప్రభాతవార్త** ఇంటి నుంచి బయటికి వెళ్ళిన మహిళ అదృశ్యమైన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాలి మండలం, ఎన్‌హెచ్ పురంకు చెందిన రత్నాలమ్మ (68) నిజాంపేట్‌లోని శ్రీనివాస నగర్, శ్రీ సూర్య అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న కుమారుడు టంకాల రమణ వద్దకు 20 రోజుల క్రితం ఆరోగ్యం బాగలేదని వైద్యం కోసం వచ్చింది. గురువారం సాయంత్రం 5 గంటలకు రత్నాలమ్మ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్ళి ఎంతకు తిరిగి రాలేదు. ఆమె గురించి కొడుకు చుట్టు ప్రక్కల వెతికినా ఎక్కడ అచూకి లభించలేదు. తెలిసిన బంధు మిత్రులకు ఫోన్ ద్వారా విచారణ చేయగా ఎక్కడకి రాలేదని తెలిపారు. ఈ మేరకు రత్నాలమ్మ కొడుకు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి : కార్పొరేటర్


విద్యార్థులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం డిసెంబరు12, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య బోధనతో పాటు నాణ్యత తో కూడిన మంచి ఆహారం అందించాలని కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పేర్కొన్నారు. బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జిఓఎస్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు మరియు పరిశుభ్రత సరిగ్గా లేదని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాఠశాలలోని తరగతి గదులను, వంట గదులను, మూత్రశాలలను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రత తరచుగా చేయాలని మరియు ప్రతిరోజు పాఠశాల ఆవరణలో శుభ్రం పరుచుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగింది మరియు పిల్లలకు మంచి విద్య బోధన తో పాటు నాణ్యతతో కూడిన మంచి ఆహారం అందించాలని కోరారు. మరియు అతి త్వరలోనే పాఠశాల అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, జిహెచ్ఎంసి ఎఈ రాజ్ కుమార్ జిహెచ్ఎంసి ఎస్ఎస్ అజీమ్ ఉద్దీన్, ఎస్ఎఫ్ఎ మై రాజ్, శ్రీకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే


బాధితుడికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం డిసెంబరు12, ప్రభాతవార్త :** సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హస్తినపురం డివిజన్ పరిధిలోని ఉమ గౌరిశంకర్ నరాలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థికస్థితులు బాగలేకవారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసన సభ్యులుదేవిరెడ్డి సుదీర్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి అనుగుణంగా వారికి 1,50,000(లక్ష యాభై వే లరూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి గారు మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం. సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు శ్రీనివాస్ నాయక్, బాధిత తల్లి సుగుణ గార్లు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ దోహదపడుతాయి : కృష్ణ



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కోచ్ ఆదిమూల కృష్ణ తదితరులు

**మలక్ పేట డిసెంబరు 12, ప్రభాతవార్త:** ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయని మార్షల్ ఆర్ట్స్ కోచ్ ఆదిమూల కృష్ణ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ మిక్స్ మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ ఆధ్వర్యంలో నగరంలో స్టేట్ రిఫరీలు, జడ్జెస్ సెమినార్ ను నిర్వహించడంతోపాటు పరీక్షలను నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన రిఫరీలు, జడ్జిలను తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ అధ్యక్షుడు రూపేష్ మాత్ అభినందించారు. అనంతరం విద్యార్థులకు వారు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మనీష్ కుమార్, మహదేవ్ రాట్, ఆదిముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే వికలాంగులకు న్యాయం జరగాలి : ముత్తినేని వీర



**తుర్కయంజాల్ డిసెంబర్ 12,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంతోరు వికలాంగులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. ఇందిరా దివ్యాంగుల సేవా సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ వికలాంగుల దినోత్సవం కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ... వికలాంగులు చదువుకొని ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలన చేసిన వికలాంగులకు అన్యాయం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే న్యాయం జరుగుతుందని అన్నారు. వికలాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క వికలాంగులకు ఆదుకోవాలని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బొబ్బల రవీందర్ రెడ్డి, కార్యదర్శి బి రామచంద్రయ్య , ఉపాధ్యక్షులు కొమురయ్య నాయక్, కోశాధికారి కప్పెర వెంకటేశ్వర్లు, జి పాండు తదితరులు పాల్గొన్నారు.

**16న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తులు ప్రారంభం**

**సరూర్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీ సోమవారం నుండి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించే ప్రక్రియ ప్రారంభమవుతుందని కమీషనర్ పి.సరస్వతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాల నేపథ్యంలో కార్పొరేషన్‌లోని డివిజన్లలో అధికారుల బృందం పర్యటిస్తుందని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ప్రతి డివిజన్‌లో ఒక అధికారి ఆధ్వర్యంలో బృందం పర్యటిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అధికారి ఇంటికి వచ్చినప్పుడు తగిన సమాచారం తెలియజేసే డాక్యుమెంట్లు, ఇంటి పన్ను రసీదులు తదితర పత్రాలను అందజేయాలని ఆమె సూచించారు. ఈ పథకానికి అర్హులైన వారు లబ్ధిదారుల ఎంపిక కోసం సహకరించాలని కమీషనర్ సరస్వతి కోరారు.

## గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం : అధ్యక్షుడు మహేష్ కుమార్

**మలక్ పేట, డిసెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టల్ల సంక్షేమాన్ని విస్మరిస్తుందని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ళ మహేష్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులు పట్ల, ఎస్సి, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లు, గురుకులాల విద్యాలయాల పట్ల వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తూ ముసారాంబాగ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు, విద్యార్థులకు న్యాయం చేసామంటూ చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు దళిత, విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న దళిత, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు న్యాయం జరిగే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న బకాయిలు, అద్దె భవనాల కిరాయిలు, వర్కర్ల జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యోమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈర్ల ప్రసాద్, మచ్చ సుధాకర్, మేడిరాజు, నిమ్మల సతీష్, ఉదయ్, యోగి, శివ, భాను ,తరుణ్, ప్రశాంత్, పవన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


ముసారాంబాగ్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహేష్ కుమార్ తదితరులు

## ఆదిపత్యం,హింస లేని సమాజం కనీస మానవ హక్కు : ప్రొ.హరగోపాల్

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** స్వేచ్ఛ, సమానత్వం, సహజీవనం, సామాజిక న్యాయం ప్రాతిపదికగా మానవ హక్కుల తీర్మానం రూపొందించబడిందని ప్రొ.జి. హరగోపాల్ పేర్కొన్నారు. ఉప్పల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విశ్వ మానవ హక్కుల ప్రకటన యొక్క వజ్రోత్సవ వేడుకలను రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ ఆకలి, ఆదిపత్యం, వివక్షత, వ్యవస్థీకృత హింస లేని సమాజం కనీస మానవ హక్కు అని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.కె.విజయ్‌కుమార్ ఆధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్ సదస్సు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు పి.విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒ జల్దా విశ్వనాద్ కుమార్, డా.ఎన్.రాజశ్రీ, డా.సి.హెచ్. సత్యనారాయణ, డా.జి.తిరుపతయ్య, కె.గీత, డా.వి.శ్రీనివాస్‌రావు, డా.ఆర్.చంద్రసాగర్, కె.అరుణ, పి.ధనలక్ష్మి, పి.వెంకటేశ్వర్లు, జి.శ్రీదేవి, కె.భాగ్యలత తదితరులు పాల్గొన్నారు. సెయింట్ పియస్, లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అసకి_తో పాల్గొన్నారు. గాత్రిని, నందకిషోర్ మానవ హక్కుల గీతాలతో అలరించారు. విద్యార్థులకు దృవపత్రాలను అతిధుల చేతుల మీదుగా అందజేశారు.



ఉప్పల్ డిగ్రీ కళాశాలలో జరిగిన మానవ హక్కుల వజ్రోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న ప్రొ.హరగోపాల్ తదితరులు

## జిల్లెలగూడలో కనుల పండువగా పదునెట్టాంబడి మహా పడిపూజ

**సరూర్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చారిత్రక జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో గురువారం అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి మహా పడిపూజోత్సవం కనుల పండువగా జరిగింది. జిల్లెలగూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు, నవయుగ యువజన సంఘం సభ్యుడు పోరెడ్డి సురేందర్‌రెడ్డి గురుస్వామి 18వ సారి మాలధారణ చేసిన సందర్భంగా పదునెట్టాంబడి పడి పూజను ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్ హరిహర క్షేత్రం మహా గురుస్వామి రంజిత్ ఆధ్వర్యంలో సురేందర్‌రెడ్డి గురుస్వామి అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అయ్యప్ప స్వాములు శరణు ఘోషల మధ్య పడిని వెలిగించారు. అనంతరం స్వాములకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ పడి పూజకు టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మీర్‌పేట్ కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, నాయ కులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


పడి పూజలో బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, మీర్‌పేట్ కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డి తదితరులు

## బిజెపి తరపున రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన ఆర్.కృష్ణయ్యకు సన్మానం

**సరూర్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి బిజెపి పార్టీ తరపున రాజ్యసభ సభ్యునిగా ఎంపికైన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఘనంగా సన్మానించారు. బిసి సంక్షేమ సంఘం నాయకుడు గుజ్జ కృష్ణ, తెలంగాణ రాష్ట్ర మహిళా జాతీయ ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ తదితరులతో కలిసి ఆయన ఆర్.కృష్ణయ్యను శాలువాతో సన్మానించి బొకే నిచ్చి రాజ్యసభ సభ్యునిగా మరోసారి ఎన్నికవుతున్నందున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిక్షపతిచారి మాట్లాడుతూ బిసిల సంక్షేమ కోసం కొన్ని దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆర్.కృష్ణయ్య రాజ్యసభకు మరోసారి ప్రాతినిధ్యం వహించడం హర్షణీయమన్నారు. కృష్ణయ్య వల్ల బిసిలకు న్యాయం జరుగుతుందని గుర్తించి బిజెపి జాతీయ అధిష్టానవర్గం పార్టీలో చేర్చుకున్న వెంటనే రాజ్యసభకు నామినేటేడ్ చేయడం సంతోషకరమని అన్నారు. కృష్ణయ్య బిజెపిలో చేరడాన్ని తామంతా స్వాగతిస్తున్నట్లు చారి స్పష్టం చేశారు. ఆయన స్ఫూర్తితో తాము పని చేస్తామని బిక్షపతిచారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నీలం వెంకటేశ్, చందు, కలకొండ శ్రీనివాసచారి, రామోజు భాస్కర్‌చారి, సంపట్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి

### ఘనంగా ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో వార్షికోత్సవం


ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రిన్సిపల్ బ్రదర్ అరుణ్‌కుమార్, జోసప్, బ్రదర్ కలరెకల్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్ జనరల్ డా.ఎం.స్టాలిన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న అభినందనీయమన్నారు. దేశం ఉజ్వలబాటలో పయనించేందుకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ప్రత్యేక ఆహ్వానితులు కేరళ అసిస్టెంట్ కలెక్టర్ డా.ఎస్.మోహనప్రియ, ఇండియన్ రైల్వే ఇంజనీర్ డా.ఇందిరాగాంధీలు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గౌరవ అతిధులు జమాలుద్దీన్, జి.రామకృష్ణనాయుడు మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థలలో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రెవ.బ్రదర్ అరుణ్ ప్రకాష్, ప్రిన్సిపల్ బ్రదర్ జోసప్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రెవ.బ్రదర్ జాన్ కలరెకల్, ఫైనాన్షియల్ అడ్మినిస్ట్రేటర్ రెవ.బ్రదర్ ఎం.ఎ.జార్జ్, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలి

**-ఎంఈఓ శంకర్ రాథోడ్**

**-శివరాంపల్లి జెడ్పిహెచ్ఎస్‌లో సిఎం కప్ పోటీలు**



**అత్తాపూర్ డిసెంబరు12,ప్రభాతవార్త :** విద్యార్థులు జిల్లా,రాష్ట్ర స్థాయిలో రాణించాలని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని శివరాంపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో సిఎం ఛాంపియన్ షిప్ పోటీలను ఎంఈఓ శంకర్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ...క్రీడలతో శారీరకంగా,మానసికంగా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆటల పోటీల వలన విద్యార్థులలో ఉన్న క్రీడా నైపుణ్యం వెలికి తీయడానికి దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కబడ్డీ, వాలీబాల్ ,ఖోఖో, పోటీలో నైపుణ్యం కనబరిచిన విద్యార్థులను ఎన్నిక చేసి జిల్లా స్థాయిలో ఆడడానికి పంపిస్తామని తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోఓ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు రూపాదేవి, హైస్కూల్ జిహెచ్ఎం సుగుణ, జోనల్ ఇంచార్జీ గంగ్యా నాయక్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి, పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షులు జనార్ధన్ చారి, పిడి రంగారెడ్డి, జ్యోతి ,బాలస్వామి రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల పిఈటిలు దేవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర కుటుంబం సర్వే డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలి

**-జోనల్ కమిషనర్ వెంకన్న, డిసి రవి కుమార్**

**అత్తాపూర్ డిసెంబరు12,ప్రభాతవార్త :** సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని జోనల్ కమిషనర్ వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిసి రవి కుమార్‌లు పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను డిసి రవి కుమార్‌తో కలిసి జోనల్ కమిషనర్ వెంకన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కుటుంబ సమగ్ర సర్వే డేటా ఎంట్రీని పటిష్టంగా చేపట్టాలని ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆపరేటర్లకు సూచించారు. వివరాలు నమోదు చేసేటప్పుడు తప్పులు దొర్లకుండా చూడాలని ఆదేశించారు.



## సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు


పరేడ్ నిర్వహిస్తున్న సైదాబాద్ పోలీస్ స్టేషన్ సిబ్బంది

**సైదాబాద్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎసిపి డి.వెంకన్న నాయక్ గురువారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి ఎవిడెన్స్ ఆధారంగా వాటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ ట్రయల్ కేసు ఫైల్స్‌ను కూడా ఆయన పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పనితీరు పట్ల ఎసిపి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పరేడ్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ రాఘవేందర్, డిఐ ఆనంద్, ఎస్ఐలు సాయి కృష్ణ, శివ శంకర్‌తో పాటు ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### లార్డ్స్ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో ప్రోత్సాహం: చైర్మన్ బీరప్ప


క్రీడో కార్యక్రమంలో లార్డ్స్ విద్యార్థులు

**సరూర్‌నగర్, డిసెంబరు 12 ప్రభాతవార్త:** లార్డ్స్ పాఠశాలల్లో విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నామని లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప తెలిపారు. బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ పాఠశాలలో క్రీడో కార్యక్రమం కింద గురువారం ప్రాథమిక విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని అన్నారు. వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో తీర్చిదిద్దడానికి క్రీడో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. తమ కార్యక్రమాలకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ కాల బైరవ బ్రహ్మోత్సవాలకు హరీష్‌రావుకు ఆహ్వానం


మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటి నేతలు

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాలభైరవ ఆలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలను గురువారం పలువురు ఆలయ కమిటి నేతలు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రీ కాల భైరవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23 తేదిలలో జరుగుతాయని, ఈ ఉత్సవాలకు తన్నీరు హరీష్‌రావుతోపాటు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పలువురు కార్పొరేటర్లతోపాటు పలువురు ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని, ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు కన్నయ్య పంతులు, ఆలయ కమిటి నేతలు కంచెమీది శివయ్య, పూజల లక్ష్మణ్, ఈగ సంతోష్, శామీర్‌పేట వినోద్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు జెట్ట కిషోర్, నిరంజన్‌చారి, కడిగె శేఖర్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి సత్యదేవుడి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు



రామంతాపూర్‌లోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం దృశ్యం.

**రామంతాపూర్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 17వ తేది నుంచి తిరుప్పావై ధనుర్మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పౌండర్ ప్యామిలీ మెంబర్ కోట్ల నరసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఇ.ఎన్.విజయభారతి తెలిపారు. ఈనెల 17న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా 17న ధనుర్మాస ప్రారంభం అవుతుందని, 20న సహస్ర కుంకుమార్చన, 24న మాస కల్యాణం, 25న తులసి అలంకారం, 31న గోమాత పూజ, జనవరి 2వ తేదిన ఊంజల్‌సేవ, జనవరి 6 తేదిన అభరణోత్సవం, 8న దీపోత్సవం, 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై ఉత్సవం, 13న గోదారంగనాధస్వామి కల్యాణం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. కాగా ఆలయంలో ఇటీవల జరిగిన సంఘటనలకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. ఆలయ కమిటి నేతల నుంచి వివరాలు సేకరించారు.

## ఉప్పల్ పిస్తా హౌజ్‌లో బ్రెడ్ కేక్‌లో ప్లాస్టిక్ కవర్

**ఉప్పల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని పిస్తా హౌజ్‌లో ఒక వినియోగదారుడు కొనుగోలు చేసిన బ్రెడ్‌లో ప్లాస్టిక్ కవర్ రావడంతో వినియోగదారులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్‌లోని పిస్తా హౌజ్‌లో బ్రెడ్ కేక్ కొనుగోలు చేసిన ఒక వినియోగదారుడు దానిని అక్కడే తింటుండగా అందులో ప్లాస్టిక్ కవర్ వచ్చింది. దీంతో అతను వెంటనే దీనిని సోషల్ మీడియాలో పెట్టాడు. అనంతరం అధికారులకు పిర్యాదు చేశారు. గత కొద్ది రోజులుగా హోటల్స్‌లలో నాసి రకంగా పదార్థాలు తయారు చేసి వినియోగదారులకు ఇస్తున్నారని, ఇదే క్రమంలో పలుమార్లు అధికారుల దాడులు చేసినా సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం పుడ్‌సేఫ్టీ అధికారులు సదరు హోటల్‌కు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికి ఆహారం విషయంలో ఎటువంటి మార్పు రావడం లేదని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి హోటల్‌పై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఉప్పల్ పిస్తా హౌజ్‌లో కొనుగోలు చేసిన బ్రెడ్ కేక్‌లో ప్లాస్టిక్ కవర్‌ను చూపిస్తున్న వినియోగదారుడు దృశ్యం.